# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

*When you speak, your words echo only across the room. Or down the hall. But when you write your voice echo down the ages.*

-Bud Gardner

# శ్రీ శర్మాజీ

మయూరిలో సబ్ ఎడిటర్‌గా పనిచేసిన వారిలో శర్మాజీ అనే అతను ఒకరు. ఆయన రాసిన కవితా సంకలనాన్ని ఓ రోజు మా ఇంటికి తీసుకువచ్చి ఇచ్చారు. ప్రేమ మీద రాసిన దాని పేరు 'నా మనసు నీకే ఇచ్చాను' లాంటిదేదో. దాదాపు పాతికేళ్ళ తర్వాత ఓ సన్యాసి లూనా మీద మా ఇంటికి వచ్చారు. కూర్చోమన్నాక ఆయన 'నన్ను గుర్తుపట్టారా?' అని అడిగారు. నేను అతన్ని గుర్తుపట్టలేదు. 'మయూరిలో పనిచేసిన శర్మాజీని' అని ఆ సన్యాసి చెప్పాడు. వయసు పెరగడం వల్ల, గడ్డం మీసాల వల్ల నాకు ఆ నాటి శర్మాజీ పోలికలు పెద్దగా కనపడలేదు. ఎవరో నేను ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చానని చెపితే విని ఆశ్చర్యపోయానని, నేను రాసిన ఓ మై గాడ్ పుస్తకం చూసానని, ఓ సారి కలవాలనిపించి వచ్చానని చెప్పారు. దాదాపు రెండు గంటలు తన సన్యాస్రాశమ స్వీకారానికి దారి తీసిన అంశాలని గురించి చెప్పారు. ఓం సాయిరామ్ అనే మాసపత్రికని చాలాకాలం నుంచి తెస్తున్నానని, దానికి ఏదైనా కాంట్రిబ్యూట్ చేయమని కోరారు. 'ఓ మై గాడ్' పుస్తకాన్ని ఇస్తే దాన్ని ఆ పత్రికలో 2010 దాకా సీరియల్ గా ప్రచురించారు. ఆనాడు మొదలైన 'ఓ మై గాడ్' పుస్తకం ఓం సాయిరాం పత్రికలో పూర్తి అయ్యాక ఇంకో కాంట్రిబ్యూషన్‌ని కోరుతూ వేదానంద సరస్వతి ఫోన్ చేసారు. ఔన్నత్యం అనే పుస్తకాన్ని పంపాను. ఇప్పుడు ఓం సాయిరాం పత్రికలో అది సీరియల్‌గా వస్తోంది.

మా ఇంట్లోంచి బయటకి వెళ్ళేప్పుడు నేను ఆయనకి పాద నమస్కారం చేస్తే 'సాయిరాం' అంటూ నివ్వెరపోయారు శర్మాజీ. ఎందుకంటే మయూరి వీక్లీలో ఉండగా చాలా పెద్ద రచయితగా నన్ను దూరం నుంచే చూసేవాడు. పలకరించడానికి కూడా సాహసించేవాడు కాడు. అతని దృష్టిలో పెద్ద రచయితనైన నేను ఆయన పాదాలకి నమస్కరించడం ఎదురు చూడకపోవడంతో షాక్ అయ్యాడు. నేను శర్మాజీకి కాక, సన్యాస సాంప్రదాయానికి నమస్కరించాను. బిచ్చగాడైనా సరే, కాషాయ దుస్తులు ధరిస్తే నేను వారి కాళ్ళకి ఇప్పటికీ నమస్కరిస్తూనే ఉంటాను.

ఆయన్ని ఎవరైనా శర్మాజీ అని పిలిస్తే కోపం వచ్చేది. తన సన్యాస నామం అయిన వేదానంద సరస్వతి అనే పిలవాలని కోరుకునేవాడు. ఆ తర్వాత అప్పుడప్పుడు ఆయన మా ఇంటికి వస్తే ఆధ్యాత్మిక విషయాలు మాట్లడుకునే వాళ్ళం. ఆయన నన్ను ఎప్పుడు కలిసినా సన్యాస్రాశమం పూర్వజన్మ పుణ్యం వల్లే లభిస్తుందని, సన్యాసి ధర్మం మనసుని ప్రపంచం మీద కాక, దైవం మీద లగ్నం చేయడం అని, ప్రపంచ వ్యామోహాల్లో, ఆస్తుల సంపాదనలో, ఆశ్రమ స్థాపనలో ఇరుక్కోవద్దని, భక్తులు వల్ల మనకి తెలీకుండా ప్రలోభంలో పడతామని హెచ్చరిస్తూండేవాడిని. గృహస్థునైన నేను ప్రతీ మంగళవారం మౌనం పాటిస్తానని, ఆయన్నీ వారంలో కనీసం ఓ రోజు మౌనం ఉండమని సూచించాను.

ఓ సారి జహీరాబాద్ లోని ఓ సన్యాసి పన్నెండేళ్ళు ఏకాంత, మౌనాల్లోకి వెళుతున్నాడని తెలిసి శర్మాజీని కూడా వస్తారా అని అడిగితే సరే అన్నారు. తన స్వంత కారులో వచ్చారు. నేనే డ్రైవ్ చేసాను. ఓ రోజు కాలినడకన తను చేసిన కైలాస, మానస సరోవర యాత్ర గురించి చెపితే ఆయన జర్నలిస్ట్ కాబట్టి ఆ అనుభవాలని పుస్తకంగా రాయమని సలహా ఇచ్చాను. తనకి రాయాలని ఉందని కానీ బద్ధకం అనీ, కొంత రాసాక కలం మూసేయాలని అనిపిస్తుందని చెపితే దాన్ని దైవకార్యంగా భావిస్తే అలా జరక్కపోవచ్చుని, నేను రాసిన హిమాలయం - మహిమాలయం అనే తీర్థయాత్ర పుస్తకాన్ని చదివి ఎంతోమంది చార్‌థామ్ యాత్రకి వెళ్ళారని, కాబట్టి దాన్ని ప్రభు సేవగా భావించి రాస్తే అనేకమందికి ఉపయోగిస్తుందని ప్రోత్సహించాను.

చివరికి ఓ రోజు ఆయన ఫోన్ చేసి, దాన్ని పూర్తిచేసానని, ధర నిర్ణయం, అచ్చు పని, డిస్ట్రిబ్యూషన్ మొదలైన వ్యవహారాల గురించి నా సలహాలని అడిగి తీసుకున్నారు. తర్వాత ఓ రోజు ఫోన్ చేసి రెండువేల కాపీలు ఏడాది తిరిగేలోగా అమ్ముడై కాలినడకన కైలాస యాత్ర అనే ఆ పుస్తకాన్ని మళ్ళీ మూడువేల కాపీలు ప్రచురించానని చెప్పారు. ఆ పుస్తకం మరాఠీ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువదించబడింది.

క్రమంగా ఆయనకి భక్తకోటి, ఆస్థులు, ఆశ్రమం ఏర్పడి, వివిధ చోట్లకి సత్సంగాలకి వెళుతూ తీరికలేనంతగా వాటితో బిజీ అయ్యారు. లెక్కలేనంత మంది ఆయనకి పాదపూజలు చేస్తున్నారు. వేదానంద సరస్వతి లౌకిక స్థాయి పెరగడంతో నా మాటలు రుచించక అనుకుంటా మా ఇంటికి రావడం, ఫోన్ చేయడం మానేసారు. ఇప్పుడు కలవడంలేదు.

శర్మాజీ అప్పట్లోనే సాయి భక్తుడని నాకు తెలీదు. అతను వేదానంద సరస్వతిగా మారడంలోని ఈ పెను మార్పు నాకు బాగా ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. అతను ఇప్పటికీ ఓం సాయిరాంలో మనసు, ప్రేమ మీద కవిత్వాలని రాస్తూనే ఉన్నారు. జయహో.

●●●

**తోటకూర రఘు, ఆంధ్రజ్యోతి**

పురాణం సుబ్రమణ్య శర్మగారు రిటైరయ్యాక జ్యోతిచిత్ర సినిమా వారపత్రిక ఎడిటర్‌గా ఉన్న తోటకూర రఘు ఆంధ్రజ్యోతి వారపత్రికకి ఎడిటర్ అయ్యారు. పురాణం గారిలానే అతను నా సీరియల్స్ వేసేవారు. 1989లో పురాణం గారు ఉండగానే రాసిన తేనెటీగకి పాఠకుల నుంచి అనుకోని స్పందన లభించింది. అందులోని త్రయంబకం అనే వృద్ధ రసికుడి పాత్ర పాఠకులకి బాగా నచ్చింది. సమాజానికి కీడు చేస్తుందని, దాన్ని ఆపేయాలని ఈదర గోపీచంద్ అనే అతను నోటీసులు ఇచ్చి నర్సరావు పేట కోర్టులో కేసు కూడా వేసాడు. 1989 లో నేను యూరప్‌ని సందర్శించాక ట్రావెలాగ్ యూరప్‌ని రాస్తే తోటకూర రఘు జ్యోతి వీక్లీలో సీరియలైజ్ చేసారు. తర్వాత అలాంటి సీరియల్‌నే అడిగితే యమాయనమః రాసాను. కానీ ట్రావెలాగ్ లోని విషయాలే ఇందులో కూడా ఉండటంతో ట్రావెలాగ్‌ని రఘు ఆపేశారు. అతనికి నా మీదకన్నా వీరేంద్రనాథ్ మీద ఎక్కువ అభిమానం. సూర్యదేవర రామ్మోహన్ రావు అంటే పడేది కాదు. నన్ను అడగలేదు కాని అతను కూడా సికరాజు పద్ధతిలో రచయితల నుంచి డబ్బు తీసుకునేవారని ఓ సారి సూర్యదేవర చెప్పారు. రచయితగా నాకు పారితోషికాన్ని అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి పంపడంలో రఘు చాలా సహకరించేవారు.

ఒకప్పుడు నేను రాసిన అదిగో పులి అనే నవలని ఆనాటి కమర్షియల్ రచయితలు తలో భాగం సీరియల్‌గా రాస్తే బావుంటుందని నేను సూచిస్తే రఘుకి ఈ ఐడియా నచ్చింది. ఆ కథని పద్దెనిమిది వారాలుగా డివైడ్ చేసి, పద్దెనిమిది సినాప్సిస్‌లని రఘుకి ఇస్తే పద్దెనిమిది మంది చేత దాన్ని రాయించాలని ఆలోచన. కథ ఇచ్చినందుకు నాకు పారితోషికం వద్దని, దాని కూడా ఆ రచయితలకే పంచమని నేను సూచించాను. దాన్ని షూట్ ఎట్ సైట్ పేరుతో మొదలు పెట్టారు. రాసిన వారిలో జి.వి.అమరేశ్వరరావు, కొమ్మనాపల్లి గణపతిరావు, శాతవాహన పేర్లు నాకు గుర్తున్నాయి. కాని కమర్షియల్ రచయితగా అది నాకు కలిగించే ఇమేజ్‌ని భరించలేని ఎవరి ప్రభావం వల్లో దాని అర్ధాంతరంగా రఘు ఆపేసారు. చిన్న డిటెక్టివ్ కథని వివరించి చివర్లో నేరస్థుడు ఎవరో చెప్పకుండా వదిలేస్తే, ఆ నేరస్థుడు ఎవరో పాఠకులు ఆధారాలని బట్టి కనుక్కునే శీర్షిక కావాలని తోటకూర రఘు నన్ను అడిగితే అలాంటివి కొన్ని ఇస్తే ప్రచురించారు. కథాకళి తరహా మినీకథలని కూడా శీర్షికగా అడిగి రఘు నా చేత రాయించారు.

డెత్ సర్టిఫికెట్ అనే సీరియల్‌ని ప్రకటించి దానికి కొన్ని వారాలు పబ్లిసిటీ కూడా రఘు ఆరంభించారు. కానీ అది మొదలవకుండానే రఘు ఆంధ్రజ్యోతి సంస్థనుంచి తొలగించబడ్డారు. ఆ తర్వాత ఆంధ్రజ్యోతి వీక్లీకి ఎడిటర్‌గా వచ్చిన త్రిపురనేని శ్రీనివాస్ ఆ సీరియల్ వద్దని తీసుకోలేదు. దాన్ని కొత్తగా విజయవాడ నుంచి వచ్చిన అంజలి అనే వారపత్రికలో రాసాను. జ్యోతి వీక్లీలో వచ్చిన పబ్లిసిటీ అంజలి వారపత్రికకి సహాయపడింది

1990లో అమెరికా వెళ్ళినప్పుడు హాలీవుడ్ లోని సావనీర్ షాప్‌లో బ్లాక్ అండ్ వైట్ చార్లీ చాప్లిన్ ఆకారంలోని గోడగడియారాన్ని తెచ్చాను. దాని చాప్లిన్ కాళ్ళు పెండ్యులంలా కదులుతుంటాయి. ఓసారి మా ఇంటికి వచ్చిన రఘు దాన్ని చూసి చాలా బావుందని మెచ్చుకున్నారు. కొద్దిరోజుల తర్వాత ఓ మామూలు గోడగడియారం తెచ్చి, ఎక్స్చేంజ్ కోరాడు. చార్లీ చాప్లిన్ గడియారాన్ని అతనికి ఇచ్చేసాను.

తోటకూర రఘు ఆ తర్వాత హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యారు. జర్నలిస్ట్‌గా ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారు అని ఎవరో చెప్పారు. ఆ తర్వాత ఓ సారి హైదరాబాదులో ఏదో తెలుగు సినిమా ప్రివ్యూలో తోటకూర రఘుని చూసాను. అతన్ని చూసి ఇరవై ఏళ్ళు దాటింది. ఆంధ్రజ్యోతి సండే సప్లిమెంట్‌కి ఎడిటర్‌గా పనిచేసే త్రిపురనేని శ్రీనివాస్ తర్వాత జ్యోతి వీక్లీకి ఎడిటర్ అయ్యారు. నాకు అంతకు మునుపే అతను పరిచయం.

●●●

## శ్రీ త్రిపురనేని శ్రీనివాస్, ఆంధ్రజ్యోతి



కొందరు ఎంతకాలం పరిచయం ఉన్నా అది పరిచయంగానే ఉండిపోతుంది తప్ప ముందుకి సాగదు. కొందరితో పరిచయం తక్కువకాలంలోనే మర్చిపోలేని స్నేహంగా రూపుదిద్దుకుంటుంది. త్రిపురనేని శ్రీనివాస్‌తో నా పరిచయం చక్కటి స్నేహంగా మారడంలో నా గొప్పతనం ఏమీ లేదు. నన్ను అతను తన స్నేహితుడిగా చేసుకున్నాడు అనే చెప్పాలి. త్రిపురనేని శ్రీనివాస్ తండ్రి మదన్ మోహన్ రావు, తల్లి రంగనాయకమ్మ. వారిద్దరిదీ కృష్ణాజిల్లానే అయినా అతను తిరుపతిలో పుట్టి పెరిగాడు. అతనికి ఇద్దరు సోదరులు. భాస్కర్, గోపీచంద్. గోపీచంద్ ఇటీవలే పోయాడు. ఇతనికి నటుడు త్రిపురనేని సాయిచంద్ వరసకి బాబాయ్ అవుతారు.

బొద్దుగా, ఎప్పుడూ ఉత్సాహంగా, హడావిడిగా ఉండే అతను నాకు 1995లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పనిచేసిన రచయిత కె.సదాశివరావు విజయవాడలో గాంధీనగర్‌లోని పోలీస్ క్లబ్‌లో ఇచ్చిన పార్టీలో పరిచయం అయ్యారు. 'శ్రీనివాస్ మంచి కవి. నెలకో కవిత్వం పుస్తకం చొప్పున చాలా సంకలనాలు ఇతరులవి వెలువరించారు' సదాశివరావుగారు చెప్పారు. అప్పట్లో అతను ఆంధ్రజ్యోతి డైలీలో సండే సప్లిమెంట్‌కి ఇన్ ఛార్జ్‌గా ఉండేవారు. డైలీ సండే సప్లిమెంట్ లో అతను నా చేత ఇలా రాయించారు. నాకు గుర్తున్నది మేనర్స్ - మేనర్స్ అనే ఎటికెట్ మీద పాఠకులకి కౌన్సిలింగ్ చేసే శీర్షిక. దీని ద్వారా ఫైవ్ స్టార్ హోటల్‌లో ఎలా ప్రవర్తించాలి నుంచి, నిత్య జీవితంలోని అనేక సందర్భాల్లో ఎలా ప్రవర్తించాలో పాఠకుల ప్రశ్నలకి జవాబులుగా రాసాను. జ్యోతికి అతను కావాలని కాన్సెప్ట్ చెప్పి సెంటర్ స్ప్రెడ్‌లో 'మన్మథ లీల' అనే సెక్స్‌కి సంబంధించిన శీర్షికని నా చేత రాయించారు. 'ఎవరికీ చెప్పక' అనే సీరియల్ నవల కూడా రాసాను.

శ్రీ త్రిపురనేని ఆంధ్రజ్యోతి సండే సప్లిమెంట్ ఎడిటర్‌గా ఉండగానే 1995 జూన్ లో ఆంధ్రజ్యోతిని విజయవాడ నించి హైదరాబాద్‌కి మార్చారు. దాంతో శ్రీనివాస్ హైదరాబాద్‌కి వచ్చారు. ఐతే హైదాబాద్ కి వచ్చిన శ్రీనివాస్ ఆర్నెల్ల తర్వాత తన బావగారి వ్యాపారం చూసుకోడానికి తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. కాని శ్రీ జగదీష్ ప్రసాద్ తిరిగి శ్రీనివాస్‌ని 1996 మార్చిలో అనుకుంటా ఆంధ్రజ్యోతి వీక్లీకి ఎడిటర్‌గా పనిచేయడానికి ఒప్పించారు. తన టీమ్‌తో శ్రీనివాస్ జ్యోతి వీక్లీకి వ్యవహారాలు చూడసాగారు.

అతనిలో కమ్యూనిజానికి చెందిన భావజాలం తీవ్రంగా ఉన్నా, బేలన్స్ ఉండేది. కమర్షియల్ రైటర్‌గా ముద్ర పడ్డ నన్ను ఇతర కమ్యూనిస్ట్ జర్నలిస్ట్‌లలా త్రిపురనేని ద్వేషించకపోగా ప్రేమించేవారు. తన కమ్యూనిస్ట్ భావజాలాన్ని ఎడిటర్‌గా పత్రిక మీద రుద్దడం అధర్మమని అతను నాతో ఎన్నోసార్లు చెప్పారు. 'ఎంతో మంది రచయితలు ఉన్నారు కాని వారెవరూ మీ అంతగా పాఠకుల ఆదరణని సంపాదించలేకపోయారు. అందుకు మీరు ఎంత కష్టపడి ఉంటారో నాకు తెలుసు. కమ్యూనిస్ట్‌ని కాబట్టి మీ ప్రతిభని కొట్టిపారేసి మిమ్మల్ని పాఠకుడికి దూరంగా ఉంచాలి అనుకోవడం తప్పు. ఈ పోస్ట్‌లో నన్ను కూర్చోపెట్టింది పాఠకులకి తమ అభిమాన రచయితల రచనలు చదివే అవకాశం కలిపించి, పత్రికల అమ్మకాలని పెంచాలని.' అని ఓసారి నాతో చెప్పారు. నిజానికి అతనికి మనుషుల్ని ప్రేమించడం సహజంగా వచ్చింది. ఎన్నడూ ఎవరి గురించీ చెడ్డగా చెప్పగా నేను వినలేదు. ఈ రోజుకీ నేను అందుకు ప్రయత్నించి విఫలం అవుతున్నాను.

'ఏడాది తిరిగే లోగా జ్యోతి వీక్లీని లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీగా మార్చాలన్నది నా తపన' అని అనేకసార్లు చెప్పారు.

తర్వాత అతను బేగంపేటలోని ఓ ఖరీదైన అపార్ట్ మెంట్లో అప్పట్లో వరంగల్ నుంచి వచ్చిన పవన్ అనే సన్నగా ఉండే మిత్రుడితో పాటు ఉండేవారు. దాన్ని అమెరికాలో ఉన్న అతని దగ్గర బంధువు బేబక్క అనే ఆమె భర్త రామస్వామిగారు ఈ వ్యాపారం కోసం స్వంతంగా కొన్నారు. ఆయన అమెరికా నుంచి పంపే కంప్యూటర్ పరికరాలని ఇక్కడ అమ్మే వ్యాపారాన్ని శ్రీనివాస్ చేస్తూ ఆ అపార్ట్ మెంట్‌లో ఉండేవారు. తనది వ్యాపార బుర్రకాదని, ఇదంతా చిరాగ్గా ఉందని చెప్పేవారు. ఎంతటి నిజాయితీ పరుడంటే, వాటిని అమ్మగా వచ్చిన డబ్బుని తక్షణం వారి బేంక్ అకౌంట్‌లో కట్టేవారు. బేబక్క భర్త ఇండియాకి వచ్చినప్పుడు రకరకాల మాంసాలతో వంట చేసి పెట్టేవాడు. ఆయనకి కౌజు పిట్టమాంసమంటే ఇష్టమని తనే స్వయంగా వండేవాడు. పావురాయి, రకరకాల పిట్టలు, కుందేళ్ళు మొదలైన వాటిని ఆదివారాలు కొని తెచ్చి వండేవాడు. ఆదివారాలు ఎర్రగడ్డ ప్రాంతంలో జరిగే సంతలో అనేక రకాల జంతువులని అమ్ముతూంటారని, వాటిని కొని తెచ్చి వండుతూంటానని ఓ సారి చెప్పాడు. ఇదంతా ఎప్పుడు నేర్చుకున్నారని నేను ఓ రాత్రి అడిగితే నక్సలైట్ కొరియర్‌గా తన అనుభవాన్ని అతను నాకు చెప్పారు.




"నా టీనేజ్ లోనే నాకు కొండపల్లి సీతారామయ్యగారితో పరిచయం. ఆయన నన్ను ఓ రోజు కొరియర్ బాయ్‌గా పంపించారు. 'లక్డీకా పూల్‌లో ఫలానా టైంకి ఫలానా చోట నుంచో. ఓ ఆటోలో ఓ చెక్క పెట్టెతో ఒకరు వస్తారు. అతను దిగి నిన్ను ఆటో ఎక్కమంటాడు. నీకు అతను తెలీదు కాని నువ్వు అతనికి తెలుసు. ఆ ఆటో ఎక్కి డ్రైవర్ చెప్పినట్లు చెయ్యి' అని చెప్పారు. ఆ ఆటో అతను నన్ను సరాసరి గౌలిగూడ బస్ స్టాండ్ కి తీసుకెళ్ళాడు. వరంగల్ వెళ్ళే బస్‌లో ఆ చెక్క పెట్టెని తీసుకుని వెళ్ళమని చెప్పాడు. నేను నెత్తిమీద ఆ బరువైన పెట్టెని పెట్టుకుని వెనక నిచ్చెన మీంచి బస్ ఎక్కి ఆ పెట్టెని టాపు మీద పెట్టాను. వరంగల్ లో నేను బస్ దిగగానే ఇద్దరు నన్ను కలిసి 'కొండపల్లి సీతారామయ్య మమ్మల్ని పంపారు' అని చెప్పారు. వాళ్ళ వెంట నేను జీప్ లో కొంత దూరం వెళ్ళి రోడ్డు పక్కన దిగాను. వాళ్ళు నన్ను ఆ పెట్టెని నెత్తిన పెట్టుకుని వారి వెనకే రమ్మన్నారు. అడవిలోకి వెళ్ళాం. ఆ రోజు చీకటి పడేదాకా నడుస్తూనే ఉన్నాం. రాత్రి ఎత్తయిన

దిబ్బ మీద పెద్ద మైనపు సంచి పరిచి దానిమీద పడుకున్నాం. కప్పుకునేందుకు ఇంకో మైనపు సంచీ ఇచ్చారు. అంతా దోమలు. ఆ అర్ధరాత్రి వర్షం వచ్చింది. దిబ్బ మీద ఎందుకు పడుకోవాలో అప్పుడు అర్ధమైంది. వాన నీరు చుట్టూ నిలవకుండా దిబ్బమీది మైనపు సంచీ మీద నుంచి కిందకి కారిపోయింది. నేలమీద పడుకుని ఉంటే చుట్టూ చేరిన వాన నీటికి తడిసి నిద్రపట్టేదికాదు. అలా మూడురోజులు ప్రయాణించి ఆ పెట్టెని వాళ్ళ మనుషులకి అందించాను. వాళ్ళు దాన్ని తెరిస్తే దాన్నిండా తుపాకీ తూటాలే! అందువల్లే అది అంత బరువుగా ఉంది. అక్కడే అన్ని రకాల మాంసాలు వండటం, తినడం అలవాటైంది.''

ఓ రాత్రి నేను అతనితో కలిసి ఆ అపార్ట్ మెంట్ లో మందు తాగాక అన్నంతో పాటు మాంసం కూర వడ్డిస్తూ చెప్పారు.

''ఇది దేని మాంసమో చెపితే కానీ మీకు తేడా తెలీదు. చికెన్ అనే అనుకుంటారు.''

అదేమిటో చెప్పమంటే చెప్పకుండా తినమని నవ్వారు. పక్కనే ఉన్న అతని మిత్రుడు, సహ ఉద్యోగి వల్లూరి రాఘవరావు అది ఉడుం మాంసం అని చెపితే ఇక దాన్ని నేను ముట్టుకోలేకపోయాను.

అప్పట్లో ప్రొహిబిషన్ అమల్లో ఉండేది కాబట్టి బార్‌లు లేవు. మేమిద్దరం మందు ప్రియులం కాబట్టి అతను మా ఇంటికి వారానికి ఓసారైనా బాటిల్‌తో వచ్చేవారు. లేదా నేను అతని అపార్ట్‌మెంట్‌కి వెళ్ళేవాణ్ణి. అప్పట్లో చారీ అనే ఒకతను తన చిన్న లూనా మీద మిలటరీలో కొన్న మద్యం సీసాలని మా ఇంటికి తెచ్చి లాభానికి అమ్మేవాడు. త్రిపురనేనికి ఆయన్ని పరిచయం చేసాను. ఇద్దరికీ ఆయన డోర్ డెలివరీ చేసేవాడు. బయట కొన్న మద్యం సీసాల్లో కల్తీ ఉండేది కాబట్టి వాటిని తాగితే మర్నాడు కన్నో, కాలో పోతుందనే భయం ఉండేది. అప్పట్లో నేనో గొప్ప సాహసమే చేసాను. బెంగుళూర్ కి ఓ కన్నడ ప్రొడ్యూసర్ పనిమీద వెళ్ళాను. అక్కడ వివిధ వైన్ షాపుల్లో 60 యం ఎల్ మీనియేచర్ ప్లాస్టిక్ లిక్కర్ బాటిల్స్ దొరికేవి. కోదండరాం అనే ఆ ప్రొడ్యూసర్ ఇచ్చిన ఐడియా వల్ల వాటిని నేను కొని అక్కడ నుంచి హైదరాబాద్‌లోని మా ఇంటికి, శ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌కి కొరియర్ ద్వారా పంపుదామని ప్రయత్నిస్తే, లిక్విడ్స్‌ని వారు నిరాకరించారు. దాంతో రిజిస్టర్డ్ పార్సెల్ ద్వారా పైన 'ఎమర్జెన్సీ మెడిసన్ హేండిల్ విత్ కేర్' అని రాసి పంపేవాడిని. శ్రీనివాస్‌కి పంపినవన్నీ మీనియేచర్ జిన్ బాటిల్స్.

''జిన్ లేడీస్ డ్రింక్ అంటారు. కానీ దానివల్ల చాలా నిషా వస్తుంది. మళ్ళీ బెంగుళూర్ ఎప్పుడు వెళుతున్నారు?'' అవి ఐపోగానే శ్రీనివాస్ అడిగారు. త్రిపురనేని ప్రతీ రోజుని పండగ రోజులా బతికేవారు. నిజానికి మందు ప్రియులని ప్రొహిబిషన్ పాడుచేసింది. ప్రొహిబిషన్ పెట్టక మునుపటి కన్నా నేను ఆ రోజుల్లో ఎక్కువ తాగేవాడిని. దొరికినప్పుడు వదలకుండా తీసుకుని తాగాలి అనే ఆలోచనలో ఉండేవాళ్ళం. నిజానికి అప్పుడు నిత్యం దొరికేది.


కె.శ్రీనివాస్

ఓ రోజు కృష్ణా ఒబెరాయ్‌లో మెక్సికన్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతోందని ప్రకటన వచ్చింది. అప్పట్లో నగరంలో ఏ ఫుడ్ ఫెస్టివల్ జరిగినా వెళ్ళేవాడిని. దానికి నాతో శ్రీనివాస్‌ని కూడా తీసుకు వెళ్ళాను. మెక్సికన్ వస్తువులతో అలంకరించిన వాతావరణం గల ఆ బఫే హాల్‌లోని సర్వర్స్ అంతా పెద్ద టోపీలతో, కౌబాయ్ డ్రెస్‌లతో ఉన్నారు. మేము ప్లేట్లలో కావాల్సినవి పెట్టుకుని కూర్చున్నాక ఇద్దరం కొద్దిగా మంచినీళ్ళు తాగి మాతో తెచ్చుకున్న చూడటానికి నీళ్ళల్లా కనిపించే ఓడ్కాని మీనియేచర్ బాటిల్స్‌లోంచి మా గ్లాసుల్లోకి రహస్యంగా కలుపుకున్నాం. అందువల్ల మేం తాగేది మంచినీరే అని చుట్టుపక్కల వారు అనుకున్నారు.

ఆ మర్నాడు రాఘవరావుని శ్రీనివాస్ కృష్ణా ఒబెరాయ్‌కి తీసుకెళ్ళి నేను అతనికి ఇచ్చిన లాంటి ఆతిధ్యాన్నే ఇచ్చాడు. డబ్బు సంపాదించాలి, దాన్ని పోగేసుకోవాలి అనే

ధోరణి శ్రీనివాస్ లో ఎంత మాత్రం ఉండేది కాదు.

త్రిపురనేని శ్రీనివాస్‌కి మంచి మిత్రబృందం ఉండేది. వాళ్ళల్లో జ్యోతి వీక్లీలో అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేసే వల్లూరి రాఘవరావు, డెయిలీలో పని చేసే కె.శ్రీనివాస్, జ్యోతి సంస్థలో పని చేసే ఉమామహేశ్వరరావు. ఇంకా అనేకమంది ఉన్నారు. త్రిపురనేనికి తన వయసు వారంటే చాలా ఇష్టం. భవిష్యత్తులో తమ రంగాల్లో తమ ఏజ్ గ్రూప్ వారే రాణిస్తారని నమ్మేవారు. పాత తరం పోయి మనం పాత తరం అయ్యాక మన రంగాల్లో మనమే ప్రముఖులుగా ఉండాలని వారితో ఉత్సాహంగా చెప్పేవాడు. అతని జోస్యం నిజమై ఆనాటి ఆ కె. శ్రీనివాసే నేడు ఆంధ్రజ్యోతి డైలీ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

అతను నా కన్నా దాదాపు పదిహేనేళ్ళు చిన్నవాడైనా నాతో చాలా ఫ్రెండ్లీగా మసులుకునేవాడు. ఇది అతని దగ్గరి వారికి నచ్చేది కాదని ఓ సారి నాతో ఇలా చెప్పారు.

"నువ్వా మల్లాది వెధవతో దేనికి తిరుగుతావు? వాడు ఉత్త భ్రష్టుడు. ఒకమ్మాయిని పెళ్ళిచేసుకోకుండా మోసం చేసి వదిలేసాడు. రాసే ప్రతీ అక్షరానికి రూపాయిలతో విలువ కట్టే కమర్షియల్ రైటర్‘ అని నన్ను చాలామంది తిడతారండి. నేను వాళ్ళని అడుగుతాను. ‘మన కమ్యూనిస్ట్ రైటర్స్‌లో ఇలాంటి ప్రతిభ చూపి, మన ఆశయాలని పాఠకులకి విశద పరిచిన రచయితలు నాకు ఒక్కరూ కనపడటం లేదు. వాడు రాసేది అందరి చేత చదివించేలా, ఆకట్టుకునేలా రాస్తున్నాడుకదా? ఎక్కడా మనల్ని తిట్టడం లేదు కదా? ఆ వెధవతో మనకెందుకు పేచీ? స్నేహపాత్రుడు. అది చాలు నాకు‘ అని జవాబు చెప్తాను."

మేమిద్దరం బాగా క్లోజ్‌గా ఉండేవాళ్ళమని అతనే వాళ్ళకి చెప్పేవారు. అతను చెప్పకపోతే మా స్నేహం గురించి వాళ్ళకి తెలిసే అవకాశం లేదు. ఎన్నో రాత్రులు ముందు కొట్టి ఇలా కమ్యూనిజం మీద, ఇతర విషయాల మీద మా అభిప్రాయాలని పంచుకునే వాళ్ళం. సంపాదకుడు - రచయిత సంబంధం కాదు మాది. స్నేహితుల మధ్య ఉండే సంబంధంగా కొనసాగేది.

తన వయసు వాడే కాబట్టి శ్రీనివాస్‌కి రామ్‌గోపాల్ వర్మ అంటే అభిమానం. అతన్ని తన స్నేహ బృందంలో చేర్చుకోవాలని ఆరాటపడేవాడు. ఓసారి ఇంటర్వ్యూ నెపంతో రాంగోపాల్ వర్మని కలిసాడు. ఏం జరిగిందో తెలీదు కాని ‘అతను చాలా తిక్కమనిషండీ, సోఫాలో ఆశ్చర్యంగా ఎగిరి కూర్చున్నాడు‘ అని చెప్పాడు. ఆ తర్వాత మళ్ళీ అతన్ని కలవడానికి ప్రయత్నించలేదు.

భోజన ప్రియత్వం విషయంలో కూడా మా అభిరుచులు కలిసాయి. మేం తరచు భోజనం గురించి మాట్లాడుకునేవాళ్ళం. అప్పుడే నాకు వంటల పుస్తకం రాయాలని అనిపించింది. త్రిపురనేని శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి వీక్లీలో వంటల ప్రత్యేక శీర్షికని ప్రవేశపెట్టాడు. రామిశెట్టి సుబ్బయ్య అనే కలం పేరుతో అప్పటి ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం ఎడిటర్ శ్రీ ఉమామహేశ్వర రావు ‘పోలూరు కూరలు‘ అనే వంటల శీర్షికలో నెల్లూరు జిల్లా వంటకాలు కొన్ని రాసారు. అతను బేగం పేటలోని త్రిపురనేని అపార్ట్ మెంట్‌లో నాకు ఓ రాత్రి తారసపడ్డాడు. ఆ రాత్రి అతను చేసిన మినపచ్చడి నాకు బాగా నచ్చడంతో ఆ రెసిపీని అడిగాను. తర్వాత తన తల్లి నుంచి ఆయన ప్రత్యేకంగా పాళ్ళు అడిగి తీసుకుని నాకు చెపితే దాన్ని నా వంటల పుస్తకంలో వేసాను.

1995లో నేను ‘డి ఫర్ డెత్‘ అనే టీవీ సీరియల్‌ని డైరెక్ట్ చేసాను. అందులో త్రిపురనేని శ్రీనివాస్‌కి ఓ వేషం ఇచ్చాను. అది పెళ్ళికొడుకు వేషం. హైదరాబాద్ ఊరి బయట ఓ చిన్న గ్రామంలోని పెంకుటింట్లో షూటింగ్. డైలాగ్స్ కంఠతా వచ్చాయి. షూటింగ్ జరుగుతూండగా ఆర్టిస్ట్‌కి డైరెక్టర్ నటన విషయంలో సూచనలు ఇవ్వడం, కుడివైపు చూడు, కూర్చోలాంటివి పరిపాటి. ఒకోసారి డైలాగ్స్ ప్రాంప్టింగ్ కూడా ఇస్తూంటారు. అలా నేను షాట్ మొదలవగానే ‘శ్రీనివాస్! కుర్చీలో కూర్చోండి‘ అనగానే నా వంక చూసారు. నేను కట్ చెప్పి నా వంక ఎట్టి పరిస్థితుల్లో చూడద్దని, నేను చెప్పేది విని ఆ ప్రకారం మాత్రమే చేయాలని చెప్పాను. పెళ్ళికొడుకు కూర్చున్న కుర్చీ విరిగి కుర్చీతో సహా అతను కింద పడతాడు. అప్పుడు కూడా బెదిరి నా వంక చూసారు. కుర్చీలోంచి పడతాడని నేను ముందుగా

అతనికి కావాలని చెప్పలేదు - నటన సహజంగా వస్తుందని. కానీ అది తను కూర్చోవడంతో విరిగిందనుకుని నా వంక చూసారు. మొదటి షాట్ లోకి వెళ్ళబోయే ముందు 'నేనేం చేయాలి?' అని అడిగారు.

"ఏం చేయద్దు. ఎవరు మాట్లాడుతూంటే వాళ్ళ వంక చూడండి. చేతైతే ఎక్స్‌ప్రెషన్ ఇవ్వండి. ప్రతీ ఆర్టిస్ట్ నటనలో ప్రధానంగా చేసే పనే ఇది" సూచించాను. అతను ఎలాంటి ఇబ్బంది పడక ఆ తర్వాత చక్కగా నటించారు. తనని ఆ రోజు అందరూ 'నీ పెళ్ళెప్పుడు? మాకు భోజనం ఎప్పుడు పెడతావు?' అని ఏడిపించారని, 'నాకు మాత్రం పెళ్ళి కూతురు చెల్లెలే నచ్చింది.' అని అతను సాటి ఆర్టిస్ట్‌లకి చెప్పానని నవ్వుతూ ఆ రాత్రి మందు కొడుతూ చెప్పారు. అతను పెళ్ళి చూపులు చూసింది ఉదయభాను అక్క పాత్రధారిణి కళ్యాణి అనే ఆర్టిస్ట్‌ని. పెళ్ళి చూపుల సరదాని శ్రీనివాస్ ఆ షూటింగ్‌లో బాగా ఎంజాయ్ చేసారు. కానీ తన్ను తాను తెరమీద చూసుకునే అదృష్టం అతనికి లేకపోయింది. అతని భాగం ఎడిటింగ్ అయ్యాక ఓసారి అతనికి ఫోన్ చేసి వచ్చి చూడమన్నాను. కానీ ఆ రోజు అతను ఎందుకో రాలేదు.

చివరి వారాల్లో అతను ఆఫీస్‌కి వెళ్ళడం తగ్గించేసారు. ఆ ఉద్యోగం మీద ఆసక్తి పోయింది. తను రాసే ఎడిటోరియల్‌ని ఆఫీసుకి ఫాక్స్ ద్వారా పంపేవారు. మాటల్లో డోంట్ కేర్‌గా కనిపించినా శ్రీనివాస్‌ది సున్నితమైన మనసు అని నా అభిప్రాయం. అందుకే కవిత్వం రాసేవారు. తన కవిత్వ సంకలనాన్ని రహస్యోద్యమం అనే పేరుతో ప్రచురించారు. సౌదాతో కలిసి 'గోదావరీ! ప్రవహించు' అనే ఇంకో సంకలనం కూడా తెచ్చారు. అతని మరణానంతరం హో అనే పేరుతో అతని మిత్రులు అతని రచనలని పుస్తకంగా తెచ్చారు.

<u>*ఆగస్ట్ 17, 1996.*</u>

ఆ రోజు ఉదయం ఏడుకి మా ఆవిడ నిద్రలేపి 'త్రిపురనేని శ్రీనివాస్ పోయాడని రాఘవ ఫోన్ చేసి చెప్పాడు' అని చెప్పింది. ఓ నిమిషం పాటు ఆ వార్తని నా మెదడు రిసీవ్ చేసుకోలేదు. 'అతనికి ఎలాంతి ప్రాణాంతక రోగం లేదే?' అన్నది నాకు వెంటనే కలిగిన ఆలోచన. ఎలా పోయాడని అడిగితే చెప్పింది. త్రిపురనేని బైక్ మీద వెలుతూ లోయర్ టేంక్ బండ్ రోడ్‌లో ఎదురుగా ఏక్సిడెంట్ అయి ఆగి ఉన్న లారీని తప్పుకోడానికి బైక్‌ని పక్కకి తిప్పారు. ఎడమవైపు సరిహద్దు గొడనుంచి బయటకి పొడుచుకు వచ్చిన రాళ్ళు తగిలి పడి పోయాడు. అతని మూలుగు విని పక్కనే ఉన్న గుడిసె వాసులు చూసి పోలీసులకి ఫోన్ చేస్తే వారు అతన్ని గాంధీ హాస్పిటల్‌కి తరలించారు. బయటకి గాయాలేం తెలీలేదు. కణతకి తగిలిన రాతి వల్ల లోపల ప్రమాదకరమైన గాయం అయి చెవిలోంచి రక్తం కారిందని తెలిసింది. అదే రోజు హాస్పిటల్లోనే త్రిపురనేని శ్రీనివాస్ పోయారు. చాలామంది శ్రీనివాస్ మా ఇంటికి వచ్చి వెళుతూ ఆ ప్రమాదానికి గురయ్యారని భావించారు. శ్రీ అక్కినేని కుటుంబరావు నాకు ఆ ఉదయం ఫోన్ చేసి 'రాత్రి త్రిపురనేని శ్రీనివాస్ మీ ఇంటికి వచ్చారా?' అని అడిగారు. 'రాలేదు' అని చెప్పాను. అప్పటికే మేం కలిసి వారం దాటుతోంది. ఆ రాత్రి నేను తాగలేదు.

వెంటనే గాంధీ హాస్పిటల్‌కి చేరుకున్నాను. మా ఇంటి నుంచి అతని ఇంటికి వెళ్ళే దారిలోనే ఈ ప్రమాదం జరగడంతో అంతా అతని చావుకి నేనే కారణం అన్నట్లు చూసారు రాఘవ వెంట వచ్చిన ఓ ఫ్రెండ్ వద్దన్నా వినకుండా మార్చురీలోకి వెళ్ళి ఇంకో శవాన్ని చూసి బయటకి వచ్చి మా ముందే వాంతి చేసుకుంది. ఎప్పుడూ ఉత్సాహంగా, చలాకీగా ఉండే శ్రీనివాస్‌ని నిర్జీవంగా చూడదల్చుకోక నేను, రాఘవ త్రిపురనేని శవాన్ని చూడటానికి లోపలికి వెళ్ళలేదు. అతని భౌతిక కాయాన్ని అనేకమంది కమ్యూనిస్ట్‌లు ఊరేగింపుగా స్మశాన వాటికకి తీసుకెళ్ళి దహనం చేసారు.

త్రిపురనేని శ్రీనివాస్ జీవించే ఉంటే ఈనాడు మంచి ఎడిటర్ అయి ఉండేవారు. లేదా అమెరికాకి వలస వెళ్ళిపోయి ఉండేవారు. బేబక్క అతన్ని అమెరికాకి రప్పించాలని అనుకునేదని శ్రీనివాస్ చెప్పారు. అతనికి వారు ఓ సారి స్పాన్సర్ చేస్తే అమెరికన్ కన్సులేట్‌కి వీసాకోసం వెళ్ళారు కానీ బి.ఏ డిస్కంటిన్యూ చేసిన అతనికి అది రాలేదు. మరణానికి కారణం అయిన ఆ సూది రాళ్ళని తక్షణం సిమెంట్ చేయాలని ఆనాడు పేపర్లలో రాసారు. ఈనాటికీ అవి అలాగే ఉన్నాయి!

'ఇరగదీద్దాం. ఆంధ్ర జ్యోతిని లార్జెస్ట్ సర్క్యులేటెడ్ చేద్దాం' అని హుషారుగా అతను చెప్పే మాటలు నేను ఇంకా మర్చిపోలేదు. అతని మరణం వల్ల ఓ మంచి ఎడిటర్‌ని పాఠకులు, ఓ మంచి మిత్రుడిని నేను కోల్పోయాం. ఏ ఏడిటర్ మరణం కూడా శ్రీనివాస్ మరణంలా నన్ను చాలా కాలం బాధించలేదు.

ఇతని తర్వాత వల్లూరి రాఘవరావు ఆంధ్రజ్యోతి ఎడిటర్ అయ్యారు. అతను నా రచనలని, ముఖ్యంగా సీరియల్‌ని జ్యోతి వీక్లీకి తీసుకోలే రౌదు. చిత్రంగా ఆ తర్వాత రాఘవరావుకి  కూడా బంజారా హిల్స్‌లో టూ వీలర్ మీద వెళుతూ ఏక్సిడెంట్ అయింది. అదృష్టవశాత్తూ అది ప్రాణాంతకం కాలేదు.

రాఘవరావుకి కమర్షియల్ రైటర్‌గా అప్పట్లో నా మీద బాగా ద్వేషం ఉండేది! కానీ శ్రీనివాస్ మిత్రుడిగా అతను నన్ను గౌరవించేవారు. ఆ తర్వాత ఆంధ్రప్రభ వీక్లీకి ఎడిటర్‌గా వచ్చాక ఓసారి రాఘవ ఇది నాకు స్వయంగా చెపితేనే తెలిసింది. తను త్రిపురనేని శ్రీనివాస్‌తో 'కమర్షియల్ రైటర్స్ ఆటంబాంబుకన్నా ప్రమాదకరమైన వారు. మల్లాదిని మీరు ఎందుకు రానిస్తారు?' లాంటివి చెప్పి ప్రభావింతం చేయాలని ప్రయత్నించి విఫలం అయ్యానని ఓ రోజు మందు పార్టీలో చెప్పారు. కానీ శ్రీనివాస్‌కి చాలా విషయాల్లో నిశ్చితాభిప్రాయాలు ఉండేవి. అంత త్వరగా అతను ప్రభావితం అయ్యే మనిషి కాదుకదా. ఇప్పుడు రాఘవరావు ఎన్టీవిలో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు.

*(మిగిలిన విశేషాలు వచ్చేనెల)*

**Click here to share your comments on this story**





